సాక్షి
అనంతపురం
బుధవారం । 4 । అక్టోబర్ । 2023



చీనీ టన్ను రూ.20 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.20 వేలు పలికాయి.



పండుగలా 'సురక్ష'

జిల్లా వ్యాప్తంగా మంగళవారం 29 ప్రాంతాల్లో 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరాలు నిర్వహించారు. 4,894 మందికి వైద్యులు చికిత్సలందించారు. 8లో

గరిష్టం/కనిష్టం
36.5°/22.6°

జిల్లా అంతటా మంగళవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

పది పరీక్ష ఫీజు చెల్లింపు గడువు పొడిగింపు



అనంతపురం ఎడ్యుకేషన్: పది ఫెయిల్ అయిన విద్యార్థులు 2024 మార్చిలో జరిగే పరీక్షలు రాసేందుకు ఫీజు చెల్లింపు గడువును ఈనెల 10 వరకు పొడిగించారు. ఈ మేరకు ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవింద్‌నాయక్ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. మూడు కంటే తక్కువ సబ్జెక్టులకు రూ.110, మూడు కంటే ఎక్కువ సబ్జెక్టులకు రూ.125, మైగ్రేషన్ పత్రం కోసం రూ.80 చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. అపరాధ రుసుం లేకుండా 10వ తేదీ వరకు చెల్లించవచ్చని, రూ.50 అపరాధ రుసుంతో 11 నుంచి 16 వరకు, రూ.200 అపరాధ రుసుంతో 17 నుంచి 23వ తేదీ వరకు, రూ.500 అపరాధ రుసుంతో 24 నుంచి 30వ తేదీ వరకు చెల్లించవచ్చని పేర్కొన్నారు. www. bse.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా స్కూల్ లాగిన్‌లో మాత్రమే ఫీజు చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

నేడు విడపనకల్లులో 'స్పందన'

అనంతపురం అర్బన్: 'జగనన్నకు చెబుదాం', 'స్పందన' మండలస్థాయి కార్యక్రమం బుధవారం విడపనకల్లులో నిర్వహించనున్నట్లు కలెక్టర్ గౌతమి తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. జిల్లా, మండలస్థాయి అధికారులు హాజరవుతారని, ప్రజలు తమ సమస్యలపై అర్జీలు అందజేయాలని కలెక్టర్ సూచించారు.

కనుంపల్లిలో ఇండస్ట్రియల్ పార్క్



అనంతపురం టౌన్: జిల్లా వ్యాప్తంగా ఎంఎస్ఎంఈ పార్క్‌ల ఏర్పాటుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ఇప్పటికే రాయదుర్గం నియోజకవర్గ పరిధిలోని వేపరాళ్ల సమీపంలో వంద ఎకరాల్లో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు స్థలాన్ని సేకరించి అభివృద్ధి పనులు వేగవంతం చేశారు. దీంతో పాటు గార్లదిన్నె మండలం కనుంపల్లి సమీపంలో 44వ జాతీయ రహదారికి అనువుగా స్థల సేకరణ చేపట్టారు. ఇప్పటికే 102 ఎకరాల స్థలాన్ని సేకరించారు. ఇక్కడ చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటు చేసుకునే యువ పారిశ్రామిక వేత్తలకు అనువుగా ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేయనున్నారు. కనుంపల్లి ఇండస్ట్రియల్ పార్క్ అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఏపీఐఐసీ అధికారులు నివేదికను సైతం ఉన్నతాధికారులకు పంపారు. అక్కడి నుంచి అనుమతులు రాగానే నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సోని తెలిపారు.

ఐటీఐల్లో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తు చేసుకోండి



అనంతపురం ఎడ్యుకేషన్: ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో 2023–24 విద్యా సంవత్సరం ప్రవేశాలకు గాను మిగులు సీట్ల భర్తీకి ఈ నెల ఏడో తేదీలోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కన్వీనర్ రామమూర్తి ఓ ప్రకటనలో కోరారు. సంబంధిత సర్టిఫికెట్లను ఈ నెల ఎనిమిదో తేదీ మధ్యాహ్నం లోపు సమీపంలోని ప్రభుత్వ ఐటీఐలో వెరిఫికేషన్ చేయించుకోవాలని సూచించారు. తొమ్మిదో తేదీ ప్రభుత్వ ఐటీఐలు, పదో తేదీ ప్రైవేట్ ఐటీఐల్లో ప్రవేశాలకు కౌన్సెలింగ్ ఉంటుందని వెల్లడించారు.

వైద్యం.. నిర్లక్ష్యం

- ప్రైవేట్ ఆస్పత్రుల ఇష్టారాజ్యం
- లోపిస్తున్న వైద్యుల పర్యవేక్షణ
- ప్రసవాల్లో పెరిగిపోతున్న నిర్లక్ష్యం
- గాల్లో కలిసిపోతున్న ప్రాణాలు
- ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లాలంటే బెంబేలెత్తుతున్న రోగులు

- ఈ ఏడాది జూలై 31న అనంతపురంలోని వెంకటరావునగర్‌కు చెందిన ప్రశాంతి (32) పురిటినొప్పులతో రాంగనగర్‌లోని శివ చైతన్య ఆస్పత్రికి వెళ్లింది. కాన్పు సమయంలో వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ప్రశాంతి మృతి చెందింది.
- ఇదే ఏడాది ఆగస్టు ఒకటో తేదీన అనంతపురంలోని ఐదో రోడ్డుకు చెందిన కళ అనే గర్భిణి ప్రసవం కోసం స్నేహలత ఆస్పత్రిలో చేరింది. వైద్యులు, స్టాఫ్‌నర్సుల నిర్లక్ష్యం కారణంగా పసికందు చనిపోయింది.
- ఆగస్టు 22న నగరంలోని చంద్ర ఆస్పత్రిలోని మాత్రికాస్ ఫెర్టిలిటీ సెంటర్‌కు కర్నూలు జిల్లా జోహాపురానికి చెందిన మోదిన్‌బీ (32) వైద్యం కోసం వచ్చింది. వైద్యులు సరైన చికిత్స చేయకపోవడంతో ఆమె ప్రాణాలు కోల్పోయింది.
- తాజాగా గార్లదిన్నె మండలం ఎగువపల్లికి చెందిన మహాలక్ష్మి కాన్పుకోసం నగరంలోని అమరావతి ఆస్పత్రికి వచ్చింది. ప్రసవం అనంతరం వైద్యుల నిర్లక్ష్యం కారణంగా తల్లీ బిడ్డ మృతిచెందారు.



మాతాశిశు మరణం చోటు చేసుకున్న అమరావతి ఆస్పత్రి వద్ద ఆందోళనకారులు, పోలీసులు

సాక్షి ప్రతినిధి, అనంతపురం : వైద్యుల నిర్లక్ష్యం నిండు ప్రాణాలను బలిగొంటున్నాయి. ప్రైవేటు ఆస్పత్రులంటేనే రోగులు బెంబేలెత్తుతున్నారు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వైద్యం చేయించుకోవాల్సిన దుస్థితి నెలకొంది. డాక్టర్ల వైద్యంపై కాకుండా దేవుడిమీద భారమేసి ఎదురుచూడాల్సి వస్తోంది. ఆయువు పోసే దేవాలయాలు కాస్త నిర్లక్ష్యంతో మృత్యు కుహరాలుగా మారుతున్నాయి. డబ్బు వ్యయం అయినా బతుకుతామా లేదా అన్నది గ్యారంటీ లేని పరిస్థితి. చివరి నిమిషం వరకూ చెప్పరు.. చేతగాకపోతే ప్రాణం పోయే ముందు బెంగళూరుకో.. హైదరాబాద్‌కో తీసుకెళ్లండని చావు కబురు చల్లగా చెబుతున్నారు. గడిచిన కొద్ది నెలల్లో డాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా అనంతపురంలో పలువురి ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి.



భర్త నరేంద్రతో మహాలక్ష్మి(ఫైల్)

చికిత్స మొత్తం గోప్యంగానే..

ప్రైవేటు ఆస్పత్రుల మాయ అంతా ఇంతా కాదు. కొన్నిసార్లు జబ్బు ఏమిటో చెప్పరు.. చికిత్స ఏమిటో తెలియజేయరు.. వ్యయం ఎంతవుతుందో కూడా చెప్పరు. 'మేం చేస్తున్నాం, వెయిట్ చెయ్యండి' అంటూ ఉంటారు. బతికి బయటపడ్డామా రెండు మూడు లక్షల రూపాయలు బిల్లు వేసి పంపిస్తారు. ప్రాణం మీదకొస్తే 'వెంటనే తీసుకెళ్లండి' అంటారు.. ప్రొసీజర్ ప్రకారమే చేశాం, ముందే చెప్పాం కదా రిస్క్ ఉంటుందని అంటారు. ప్రొసీజర్ ప్రకారమే చేసినప్పుడు ప్రొసీజర్ ప్రకారమే ఏ చికిత్సకు ఎంత చార్జి చేస్తున్నామో, ఏ మందులు వాడుతున్నామో, జబ్బు ఏమిటో చెప్పాలి కదా అంటే దానికి సమాధానం ఉండదు. తాజాగా అనంతపురంలోని అమరావతి ఆస్పత్రిలో 26 ఏళ్ల మహిళతో పాటు పసికందు మృతి కూడా ఇలాంటిదే.

ఉమ్మడి జిల్లాలో ప్రైవేటు ఆస్పత్రులు	
కేటగిరీ	సంఖ్య
పాలి క్లినిక్స్	6
20 పడకలలోపు ఆస్పత్రులు	111
50 పడకలలోపు ఆస్పత్రులు	31
100 పడకలలోపు ఆస్పత్రులు	15
200 పడకలలోపు ఆస్పత్రులు	4
200 పడకలపైన ఆస్పత్రులు	2
డయాగ్నస్టిక్ సెంటర్లు	81
హై ఎండ్ డయాగ్నస్టిక్ సెంటర్లు	6

కఠిన చర్యలు తీసుకుంటాం



వైద్యుల నిర్లక్ష్యం కారణంగా బాధితులకు అన్యాయం జరిగితే మెడికల్ కౌన్సిల్ కఠిన చర్యలు తీసుకుంటుంది. వైద్య విభాగంలో మెడికల్ కౌన్సిల్ కూడా కోర్టు లాంటిదే. వైద్యులది తప్పు అని తేలితే జీవితకాలం ప్రాక్టీస్ చెయ్యకుండా చేయగలం. ఆ వైద్యుల రిజిస్ట్రేషన్ రద్దు చేస్తాం. ఆస్పత్రి అనుమతులు రద్దు చేయచ్చు. ఏపీ మెడికల్ కౌన్సిల్‌కు అఫిడవిట్ రూపంలో బాధితులు ఫిర్యాదు చేయాలి. వెంటనే విచారణకు ఆదేశిస్తాం.

– డాక్టర్ బి.సాంబశివారెడ్డి, చైర్మన్, ఏపీ మెడికల్ కౌన్సిల్

మాతా శిశు మరణం

- అమరావతి ఆస్పత్రిలో ఘటన
- బాధిత కుటుంబ సభ్యుల ఆందోళన
- వైద్యుల నిర్లక్ష్యంపై తీవ్రస్థాయిలో ఆగ్రహం



తల్లి, శిశువు మృతదేహాలు

అనంతపురం క్రైం: నగరంలో మాతా శిశు మరణం సంభవించింది. ప్రైవేట్ ఆస్పత్రిలో ఈ ఘటన చోటు చేసుకుంది. వైద్యుల నిర్లక్ష్యం రెండు ప్రాణాలను బలితీసుకుందంటూ బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళనకు దిగారు. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గార్లదిన్నె మండలం ఎగువపల్లికి చెందిన నరేంద్ర భార్య మహాలక్ష్మి గర్భం దాల్చింది. కుటుంబ సభ్యులు ఎంతో జాగ్రత్తగా చూసుకుంటూ.. అనంతపురంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్దనున్న ప్రైవేట్ ఆస్పత్రిలో క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించేవారు. రెండు నెలల కిందట సదరు ఆస్పత్రిలో సరైన చికిత్స అందక ఒక మహిళ మృతి చెందింది. దీంతో అక్కడికి వెళ్లడం మానేశారు. ఈ క్రమంలో సోమవారం ప్రసవం కోసం కుటుంబ సభ్యులు మహాలక్ష్మిని అనంతపురంలోని అమరావతి ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. సాయంత్రం నాలుగు గంటలకు పురిటినొప్పులు మొదలయ్యాయి. వైద్యులు ఆమెను లేబర్ రూంలోకి తీసుకెళ్లారు. ఆ సమయంలోనే కొన్ని కాగితాలపై సంతకాలు తీసుకున్నారు. రాత్రి 8.45 గంటలకు బయటకు వచ్చిన వైద్యులు మహాలక్ష్మి ఆడశిశువుకు జన్మనిచ్చిందని తెలిపారు. అయితే దురదృష్టవశాత్తు శిశువు మృతి చెందిందని చెప్పారు. తల్లి ఆరోగ్యంగానే ఉందని ఐసీయూలోకి షిఫ్ట్ చేశారు. కాసేపటి తర్వాత ధైర్యం చెబుతామని లోనికి వచ్చిన భర్త, బంధువులను చూసి తన బిడ్డను చూపించాలని మహాలక్ష్మి పట్టుబట్టింది. దీంతో వారు బేబీ మరో వార్డులో ఉందని, తర్వాత చూపిస్తామని చెప్పి సముదాయించారు. అర్ధరాత్రి 12 గంటల సమయంలో సిబ్బంది గాబరా పడుతూ హడావుడి చేయడం గమనించిన బంధువులు లోనికెళ్లి పరిశీలించగా మహాలక్ష్మి స్పృహలో లేదు. లేపినా, మాట్లాడించినా స్పందించలేదు. అనుమానం వచ్చి ఆస్పత్రి సిబ్బందిని ఆరా తీయగా మహాలక్ష్మి కూడా చనిపోయిందని చెప్పారు. తేరుకుని మాట్లాడుదామనుకునేలోపు సిబ్బంది జారుకున్నారు.

ఆస్పత్రి యాజమాన్యంపై ఆగ్రహం

బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు పెద్ద సంఖ్యలో మంగళవారం అమరావతి ఆస్పత్రికి చేరుకుని ఆందోళనకు దిగారు. తమ కూతురును ఆస్పత్రి వారే చంపేశారంటూ మహాలక్ష్మి తల్లిదండ్రులు చంద్రావతి, జయరాములు గుండెలవిసేలా రోదించారు. 'వీళ్లు డాక్టర్లు కాదు... హంతకులు. ఇలాంటి ఆస్పత్రులను మూసేయండి' సార్ అంటూ పోలీసులను వేడుకున్నారు. వైద్యుల పర్యవేక్షణ లేకుండా కాన్పులు చేసి ప్రాణాలు బలిగొంటున్నారని ఆరోపించారు. వైద్యుల స్థానంలో నర్సులు, సిబ్బందే ఇష్టమొచ్చినట్లు ప్రసవాలు చేసేస్తున్నారని మహాలక్ష్మి భర్త నరేంద్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మనుషుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న వైద్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలీసులు బాధిత కుటుంబ సభ్యులకు సర్దిచెప్పి ఆందోళనను విరమింపజేశారు.

ఎక్స్‌పర్ట్ కమిటీతో విచారణ

అనంతపురం మెడికల్: అమరావతి ఆస్పత్రిలో మహాలక్ష్మి (26), శిశువు మృతికి గల కారణాలను తెలుసుకోవడానికి ఎక్స్‌పర్ట్ కమిటీతో విచారణ చేయిస్తామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఇ.భ్రమరాంబదేవి తెలిపారు. మాతాశిశు మరణం గురించి తెలియగానే డీఎంహెచ్‌ఓతో పాటు డీసీహెచ్‌ఎస్ పాల్ రవికుమార్ మంగళవారం అమరావతి ఆస్పత్రిని సందర్శించి, వివరాలు ఆరా తీశారు. విచారణ అనంతరం చర్యలు తీసుకుంటామన్నారు.

కామాంధుడికి పదేళ్ల జైలు

- పోక్సో కేసులో శిక్ష

గాండ్లపెంట: పోక్సో కేసులో ఓ కామాంధుడికి 10 ఏళ్ల జైలు శిక్ష పడింది. ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపిన మేరకు... శ్రీసత్యసాయి జిల్లా గాండ్లపెంట మండలం సోమయాజులపల్లి పంచాయతీ ఎర్రజేనుపల్లికి చెందిన ఇరగదిండ్ల గంగరాజు.. 2020 మేలో అదే గ్రామానికి చెందిన ఏడేళ్ల బాలికపై అత్యాచారానికి యత్నించాడు. చాక్లెట్లు, బిస్కెట్లు ఆశ చూపి ఓ పాడుబడిన ఇంటి వెనకాల వైపు తీసుకెళ్లి బాలికను వివస్త్రను చేశాడు. బాధితురాలి తల్లిదండ్రుల మేరకు అప్పటో మండల ఎస్ఐగా ఉన్న గురుప్రసాద్‌రెడ్డి ఐపీసీ సెక్షన్ 7, 8 రెడ్‌విత్ 511 కింద కేసు నమోదు చేశారు. అనంతపురంలోని పోక్సో కోర్టులో ఈ కేసు విచారణ మంగళవారం జరిగింది. పబ్లిక్ ప్రాసిక్యూటర్ విద్యావతి వాదనలు వినిపించారు. నేరం రుజువు కావడంతో ముద్దాయి గంగరాజుకు 10 సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.2,000 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి రాజ్యలక్ష్మీ తీర్పు చెప్పారు. తగిన సాక్ష్యాధారాలతో ముద్దాయికి శిక్ష పడేలా చేసిన ఎస్ఐ గురుప్రసాద్ రెడ్డి, కానిస్టేబుల్ మధుసూదన్‌ను ఎస్పీ మాధవరెడ్డి అభినందించారు. తప్పు చేసిన వారికి శిక్ష పడేలా ప్రతి పోలీసు అధికారి పనిచేయాలని పిలుపునిచ్చారు.

ఆముదం.. రైతన్న ఆమోదం!

- ఉమ్మడి జిల్లాలో ప్రధాన పంటగా గుర్తింపు
- అధికారుల అంచనాకు మించి సాగు

అనంతపురం అగ్రికల్చర్: పదేళ్ల కిందట వరకు రైతులకు పెద్దగా పరిచయం లేని ఆముదం ఇటీవల ప్రధాన పంట జాబితాలోకి చేరింది. గతంలో కేవలం అక్కడక్కడా ఎరపంటగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నాలుగైదు వేల ఎకరాలకు మించి సాగు చేయని పరిస్థితి. ప్రస్తుతం వందలు, వేల ఎకరాల్లో సాగు చేస్తుండడం గమనార్హం. ఏకపంటగా విస్తరించిన వేరుశనగను బాగా తగ్గించేసి దాని స్థానంలో కంది, పత్తి, మొక్కజొన్న లాంటి పంటలపై దృష్టి సారించారు. ఈ జాబితాలో ఆముదం కూడా చేరడంతో ప్రధాన పంటగా మారింది. కనగానపల్లి మండలం వేపకుంట లాంటి కొన్ని గ్రామాల్లో అయితే 70 నుంచి 80 శాతం మంది రైతులు కేవలం ఆముదం పంట సాగు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలో రామగిరి, ఆత్మకూరు, రాప్తాడు, కనగానపల్లి, గుంతకల్లు, వజ్రకరూరు, గార్లదిన్నె, కూడేరు, తాడిపత్రి, గుత్తి, బెళుగుప్ప, రొద్దం, బుక్కరాయసముద్రం, అనంతపురం, పెద్దపప్పూరు, యల్లనూరు, యాడికి, ముదిగుబ్బ, ధర్మవరం, బత్తలపల్లి, ఉరవకొండ తదితర ప్రాంతాల్లో ఇటీవల ఈ పంట విస్తీర్ణం బాగా పెరుగుతోంది.

సర్కారు తోడ్పాటు..

వ్యవసాయ పరిశోధనా స్థానం అభివృద్ధి చేసిన కొత్త వంగడాలను అందుబాటులోకి తేవడంతో సాగుకు రైతులు ఆసక్తి కనపరుస్తున్నారు. మోస్తరు వర్షాలు వచ్చినా తక్కువ పెట్టుబడితో అంతో ఇంతో పంట చేతికి వస్తుందని రైతులు నమ్ముతున్నారు. ఎకరాకు ఐదారు క్వింటాళ్లు దిగుబడులు వస్తుండటం, క్వింటా రూ.4 వేల నుంచి రూ.7 వేల వరకు పలికిన దాఖలాలు ఉండటంతో సాగు విస్తీర్ణం పెరుగుతున్నట్లు చెబుతున్నారు. ఈ ఏడాది ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా లక్ష ఎకరాలకు పైగా ఆముదం సాగైనట్లు అంచనా వేస్తున్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు మొట్టమొదటి సారిగా ఆముదం పంటను వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకంలోకి చేర్చడంతో రైతుల నుంచి హర్షాతిరేకం వ్యక్తమవుతోంది. పంట దిగుబడుల ఆధారంగా బీమా వర్తింపజేశారు. భవిష్యత్తులో కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) కూడా ప్రకటించే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు.



వేపకుంట గ్రామంలో ఆముదం పంటను పరిశీలిస్తున్న జిల్లా శాస్త్రవేత్తలు (ఫైల్)

నేడు వేపకుంట, సనపలో శాస్త్రవేత్తల బృందం ఫీల్డ్‌డే..

భారత వ్యవసాయ పరిశోధనా సంస్థ (ఐసీఏఆర్)కు చెందిన ఏపీ, తెలంగాణాల నుంచి శాస్త్రవేత్తల బృందం బుధవారం జిల్లా పర్యటనకు వస్తున్నట్లు బుక్కరాయసముద్రం మండలం రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.సహదేవరెడ్డి, శాస్త్రవేత్తలు డాక్టర్ రాధిక, డాక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి సాక్షికి తెలిపారు. ఐసీఏఆర్ డైరెక్టర్ డాక్టర్ కేఆర్ మాథూర్ నేతృత్వంలోని డాక్టర్ సి.లావణ్య, డాక్టర్ జీడీ సతీష్‌కుమార్, డాక్టర్ జవహర్‌లాల్ జాటోతు, డాక్టర్ టి.మంజునాథ్‌లతో కూడిన బృందం బుధవారం ఉదయం 11 గంటలకు ఆత్మకూరు మండలం సనప గ్రామం, మధ్యాహ్నం 2.30 గంటలకు కనగానపల్లి మండలం వేపకుంట గ్రామాల్లో ఫీల్డ్‌డేలో పాల్గొంటారని తెలిపారు. ఆముదం పంట స్థితిగతులు, రైతుల అనుభవాలు, కొత్త వంగడాలు, ఉత్పత్తి, ఉత్పాదకశక్తి, ఆదాయం, లాభనష్టాల గురించి రైతులతో ముఖాముఖి ఉంటుందని తెలిపారు.

పారిశ్రామిక పరుగులు

- జాజరకల్లు వద్ద రూ.544 కోట్లతో ఇథనాల్ పరిశ్రమ
- ప్రత్యక్షంగా 500, పరోక్షంగా 1000 మందికి ఉపాధి
- నేడు వర్చువల్‌గా భూమిపూజ చేయనున్న సీఎం జగన్

రాయదుర్గం: కర్ణాటక సరిహద్దునున్న రాయదుర్గం నియోజకవర్గం డి.హీరేహాళ్ మండలం పారిశ్రామికంగా పరుగులు తీస్తోంది. ఇప్పటికే పలు రకాల ఐరన్ ఓర్ పరిశ్రమలు ఉన్నాయి. తాజాగా జాజరకల్లు వద్ద రూ.544 కోట్ల వ్యయంతో మొక్కజొన్న వ్యర్థాలు, బియ్యం నూక నుంచి ఇథనాల్ ఇంధనం తయారు చేసే పరిశ్రమ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ మేరకు ఎకో స్టీల్ ఇండియా లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో గ్రీన్‌ఫీల్డ్ ప్రాజెక్ట్ ఆఫ్ గెయిన్ బెస్ట్ డిస్టిలరీ ప్లాంట్ ప్రతినిధులతోనూ ఇటీవల ఒప్పందం పూర్తి చేసుకుంది. బుధవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్ విధానంలో ప్లాంట్ ఏర్పాటు పనులకు భూమిపూజ చేయనున్నారు.



ఫ్యాక్టరీ నమూనా

- ఇథనాల్ ఇంధనం తయారీ పరిశ్రమకు అవసరమైన 120 ఎకరాల భూములను ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ నిమిష్‌గోడోడియా ముందుగానే సేకరించి సిద్ధం చేసుకున్నారు. జీ–20 సదస్సులో ఆహార శుద్ధి, పరిశ్రమల రంగంలో మొత్తం 13 ప్రాజెక్టులకు సబంధించి రూ.2,851 కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి తరలివచ్చాయి. ఇందులో భాగంగా జాజరకల్లు వద్ద ఏర్పాటయ్యే ఇథనాల్ ఇంధనం తయారీ ప్లాంట్‌లో ప్రత్యక్షంగా 500 మంది, పరోక్షంగా 1000 మందికి ఉపాధి అవకాశం లభించనుంది.

ఫలించిన విప్ కాపు కృషి

వెనుకబడిన రాయదుర్గం నియోజకవర్గాన్ని పరిశ్రమల ఏర్పాటు ద్వారా అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అడుగులు వేస్తున్నారు. ఏపీఐఐసీ ఆధ్వర్యంలో సోలార్ ఏర్పాటుకు ముందుకొచ్చిన కంపెనీలకు సైతం ఆ సంస్థ చైర్మెన్ మెట్టు గోవిందరెడ్డి తో కలసి నియోజకవర్గం వ్యాప్తంగా 12 వేల ఎకరాల భూములు సేకరించేలా ప్రణాళికలు చేపట్టారు. జాజరకల్లు వద్ద ఇథనాల్ ఇంధనం తయారీ ప్లాంట్ ఏర్పాటుకు ఎన్ని ఆటంకాలు ఎదురైనా కావాల్సిన అనుమతులు, మౌలిక సౌకర్యాలు కల్పించే విషయంలో విప్ కాపు సఫలీకృతులయ్యారు.

మొక్కజొన్నకు పెరగనున్న డిమాండ్

ఇథనాల్ ప్లాంట్ ప్రారంభమైతే మొక్కజొన్న నుంచి రోజుకు 400 కేఎల్‌డీ (కిలో లీటర్ పర్ డే) ఆయిల్ ఉత్పత్తి చేస్తారు. ఈ ప్రాంతంలో పండించే మొక్కజొన్నకు డిమాండ్ బాగా పెరగనుంది. పంట చేతికొచ్చినపుడు రైతులు దళారులను ఆశ్రయించకుండా నేరుగా ప్లాంట్‌కు తరలిస్తే ఆశించిన స్థాయిలో గిట్టుబాటు ధర లభిస్తుంది. ప్లాంట్ ద్వారా ఉత్పత్తయిన ఇంధనాన్ని పెట్రోల్, డీజిల్ తయారీకి వినియోగిస్తారు.

సంతోషంగా ఉంది



మారుమూల గ్రామమైన జాజరకల్లులో ఇంధన తయారీ ఫ్యాక్టరీ ఏర్పాటు కాబోతుండటం సంతోషంగా ఉంది. ఉపాధి కోసం బళ్లారి, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లే మాలాంటి కూలీలకు ఈ పరిశ్రమ ద్వారా ఎంతో ప్రయోజనం చేకూరుతుంది.

– గౌరమ్మ, కూలీ, జాజరకల్లు

గ్రామాభివృద్ధికి బాటలు



జాజరకల్లు వద్ద ఇథనాల్ ఇంధన తయారీ ప్లాంట్ ఏర్పాటు కోసం యాజమాన్యం ముందుకొచ్చినా పలు సాంకేతిక చిక్కులు వచ్చాయి. స్థానికులకు జీవనోపాధుల దృష్ట్యా వాటిని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అధిగమించేలా సీఎం జగన్ దృష్టికి పలుమార్లు తీసుకెళ్లారు. జీ–20 సదస్సు నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్లాంట్ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. చాలా సంతోషంగా ఉంది. ఇక మా గ్రామ అభివృద్ధికి కూడా బాటలు పడబోతున్నాయి.

– శ్రీనివాసరెడ్డి, సర్పంచ్, జాజరకల్లు

నిరుద్యోగ సమస్య తీరనుంది



జాజరకల్లు వద్ద ఏర్పాటు కానున్న ఇథనాల్ ఇంధన తయారీ పరిశ్రమలో ఎక్కువగా స్థానికులకే ఉద్యోగ అవకాశాలు దక్కేలా కృషి చేస్తాం. ప్రత్యక్షంగా 500 మంది, పరోక్షంగా 1000 మందికి ఉపాధి లభించనుంది. సీఎం జగన్ కృషితోనే రాష్ట్రం పారిశ్రామిక హబ్‌గా మారనుంది. జీ–20 సదస్సులో రాష్ట్రానికి 13 పరిశ్రమలు రాబట్టేలా ఏపీ ప్రభుత్వం చేసిన కృషి అభినందనీయం. అందులో జాజరకల్లు ఉండడంతో ఆనందాన్నిచ్చింది. మంచిచేసే ప్రభుత్వానికి ప్రజలంతా మద్దతుగా నిలవాలి.

– కాపు రామచంద్రారెడ్డి, ప్రభుత్వ విప్

ఓటరు జాబితా ఫిర్యాదులు పరిశీలిస్తున్నాం

- సీఈఓకు వివరించిన కలెక్టర్ గౌతమి

అనంతపురం అర్బన్: ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ–2024 సందర్భంగా రాజకీయ పార్టీల నుంచి అందిన ఫిర్యాదులను నిశితంగా పరిశీలిస్తున్నామని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనాకు కలెక్టర్ ఎమ్.గౌతమి చెప్పారు. ఓటర్ల జాబితా సవరణ, రాజకీయ పార్టీలు సమర్పించిన క్లెయిమ్‌లు, అభ్యంతరాలు, తదితర అంశాలపై సీఈఓ మంగళవారం విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లతో సమీక్షించారు. అనంతపురం కలెక్టరేట్ నుంచి కలెక్టర్‌తో పాటు డీఆర్‌ఓ గాయత్రీదేవి, ఇతర అధికారులు పాల్గొన్నారు. జిల్లాలో ఓటర్ల జాబితా సవరణ, తొలగింపు ఓట్ల పునఃపరిశీలన గురించి సీఈఓకు కలెక్టర్ వివరించారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా ఓట్ల తొలగింపుపై రాజకీయ పార్టీల నుంచి అందిన 56,874 ఫిర్యాదుల పరిశీలన పూర్తి చేశామన్నారు. అదే విధంగా ఫారం 6, 7,8లకు సంబంధించి ఎలాంటి పెండింగ్ లేకుండా పరిశీలనను సకాలంలో పూర్తికి చర్యలు చేపట్టామన్నారు.

ఈవీఎంల స్కానింగ్ పూర్తి

జిల్లాకు కొత్తగా వచ్చిన ఈవీఎంల స్కానింగ్ ప్రక్రియ పూర్తి చేశామని సీఈఓకు కలెక్టర్ చెప్పారు. పాత ఈవీఎంలను హైదరాబాద్, ఘజియాబాద్‌కు తరలించామన్నారు. యాక్సెప్టెన్స్ టెస్ట్ ప్రొసీజర్స్ (ఏటీపీ) ఆఫ్ ఈవీఎంలో భాగంగా బెల్ కంపెనీ నుంచి వచ్చిన ఇంజనీర్లు ఈవీఎంలను, వీవీప్యాట్స్‌ను పరిశీలించారన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్డీఓలు నిశాంత్‌రెడ్డి, రవీంద్ర, డిప్యూటీ కలెక్టర్లు సుధారాణి, శ్రీనివాసులు, కేశవనాయుడు, వెంకటేశ్వర్లు, ఎన్నికల డీటీ కనకరాజు, ఎస్ఏ శామ్యూల్ బెంజిమన్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ గౌతమి

ఆరోగ్య సురక్షపై ప్రత్యేక శ్రద్ధ

అనంతపురం అర్బన్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రత్యేక శ్రద్ధతో నిర్వహించాలని కలెక్టర్ గౌతమి అధికారులను ఆదేశించారు. ఆరోగ్య సురక్ష క్యాంపుల ఏర్పాటుపై కలెక్టర్ మంగళవారం తన క్యాంపు కార్యాలయం నుంచి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆరోగ్య సురక్ష క్యాంపుల్లో ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా పాల్గొనేలా చూడాలన్నారు. క్యాంపులను డీఎంహెచ్‌ఓ కార్యాలయంలోని కంట్రోల్ రూమ్ ద్వారా పర్యవేక్షించాలని ఆదేశించారు. క్యాంపులో డేటా ఎంట్రీ ఆపరేటర్లను నియమించాలన్నారు. ఇంటింటి క్యాంపెయిన్ పూర్తిస్థాయిలో చేపట్టాలని సూచించారు. ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ఉపయోగాలు, ఇతర వివరాలను ప్రజలకు విస్తృతంగా తెలియజేయాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, డీఎంహెచ్‌ఓ భ్రమరాంబదేవి, ఆరోగ్యశ్రీ కో–ఆర్డినేటర్ కిరణ్ కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ ప్రభంజనం తథ్యం

• వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా



అనంతపురం కార్పొరేషన్: రాష్ట్రంలో ఇప్పటికిప్పుడు ఎన్నికలు వచ్చినా వైఎస్సార్‌సీపీ ప్రభంజనాన్ని అడ్డుకోవడం ఎవరి తరం కాదని తాజాగా టైమ్స్ నౌ సర్వేలో వెల్లడైందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య తెలిపారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత నెలలోనూ సర్వే ఫలితాలను టైమ్స్ నౌ వెల్లడి చేసిందన్నారు. అందులోనూ వైఎస్సార్‌సీపీ విజయం ఖాయమని స్పష్టం చేసిందన్నారు. టీడీపీ, జనసేనకు భంగపాటు తప్పదని తాజా సర్వే నివేదికలు బహిర్గతం చేస్తున్నాయన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో అధికారాన్ని అడ్డు పెట్టుకుని పోలవరం, సచివాలయ నిర్మాణం, ఏపీ ఫైబర్ గ్రిడ్, అమరావతి భూములు, విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు, స్కిల్ డెవలప్‌మెంట్, తదితర వాటిలో చంద్రబాబు, లోకేష్ అక్రమాలకు పాల్పడినట్లుగా ప్రజలు సంపూర్ణంగా విశ్వసిస్తున్నారన్నారు. పూటకోమాట మాట్లాడే జనసేనాని మాటలు ఎవరూ నమ్మే పరిస్థితి లేదన్నారు. ఈ రెండు పార్టీలు కలసి వచ్చినా రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభంజనాన్ని అడ్డుకోలేవన్నారు.

మెడికో అదృశ్యం



చైతన్య (ఫైల్)

పెద్దపప్పూరు: మండలంలోని కొట్టాలపల్లికి చెందిన పి.చైతన్య కనిపించడం లేదు. తల్లి యశోద ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, కర్నూలులోని మెడికల్ కళాశాలలో వైద్య విద్యను అభ్యసిస్తున్న చైతన్య ఇటీవల వినాయకచవితి పండుగకు ఇంటికి వచ్చాడు. మంగళవారం తెల్లవారుజాము మూడు గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లిన చైతన్య తిరిగి రాలేదు. ఫోన్‌లో సంప్రదించేందుకు తల్లి ప్రయత్నిస్తే స్విచ్ఛాఫ్ అంటూ సమాధానం వచ్చింది. దీంతో బంధువులను, కుమారుడి స్నేహితులను ఆరా తీసినా ఆచూకీ లభ్యం కాలేదు. ఘటనపై యశోద ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ ఖాజాహుస్సేన్ తెలిపారు.

పండుగలా 'సురక్ష'

• జిల్లా వ్యాప్తంగా 29 ప్రాంతాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు
• పెద్ద ఎత్తున తరలివస్తున్న రోగులు
• ఉచిత వైద్య పరీక్షలతో పాటు చికిత్స, మందుల పంపిణీ



ఆటో వద్దనే ఈరన్నకు చికిత్స అందజేస్తున్న వైద్యుడు

ఆటోలో ఉన్న ఇతని పేరు ఈరన్న. అనంతపురంలోని జనశక్తి నగర్‌కు చెందిన ఆయన షుగర్ వ్యాధితో బాధపడుతున్నాడు. వ్యాధి తీవ్రత కారణంగా రెండు కాళ్లు తీసేశారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఇంటి వద్దకే వలంటీర్లు వెళ్లి అతని పరిస్థితి తెలుసుకుని వైద్యాధికారులకు నివేదిక అందజేశారు. దీంతో మంగళవారం ఇందిరానగర్‌లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి ఆటోలో చేరుకున్న ఆయనకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా వాహనంలో ఉండగానే వైద్య నిపుణుడు చికిత్స అందజేశారు. ఇంత గొప్ప వైద్య సేవ అందుతుందని తాను అనుకోలేదని, రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత తనలాంటి పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందుతున్నాయంటూ ఈ సందర్భంగా ఆయన హర్షం వ్యక్తం చేశారు.



అనంతపురంలోని ఇందిరానగర్‌లో ఏర్పాటు చేసిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరంలో మందులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి, డీఎంహెచ్‌ఓ భ్రమరాంబదేవి

అనంతపురం మెడికల్: వివిధ రకాల రుగ్మతలతో బాధపడుతున్న వారికి మెరుగైన వైద్యం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జిల్లాలో పండుగలా సాగుతోంది. జిల్లాలోని 29 ప్రాంతాల్లో (రూరల్ 28, అర్బన్ 1) మంగళవారం ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. ఈ శిబిరాల్లో 116 మంది స్పెషలిస్టు, మెడికల్ ఆఫీసర్లు, వందల సంఖ్యలో ఫార్మాసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు, సీహెచ్‌ఓలు పాల్గొని నాణ్యమైన సేవలందించారు. మొత్తం 4,894 ఓపీ కేసులు రాగా... గైనకాలజిస్టు, సర్జన్, ఫిజీషియన్, చిన్నపిల్లల, కంటి వైద్య నిపుణులు పరీక్షలు నిర్వహించి 307 మందిని జిల్లా, నెట్‌వర్క్ ఆస్పత్రులకు రెఫర్ చేశారు.

ప్రతి ఒక్కరికీ స్క్రీనింగ్

అనంతపురంలోని ఇందిరానగర్, నారాయణపురంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని స్థానిక ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి ప్రారంభించారు. అలాగే శింగనమల నియోజకవర్గం పుట్లూరు మండలం చెర్లోపల్లిలో ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఉరవకొండ నియోజకవర్గం కూడేరు మండలం గొట్కూరులో మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి.. వైద్య శిబిరాలను ప్రారంభించి, అందుతున్న సేవలపై రోగులతో ఆరా తీశారు. ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఈ సందర్భంగా వైద్యులకు వారు సూచించారు. ప్రతి ఒక్కరికీ హెల్త్ స్క్రీనింగ్ పక్కాగా నిర్వహించాలని కోరారు. ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన ఈ బృహత్తర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతపురంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట నగర డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కరరెడ్డి, జేసీఎస్ కన్వీనర్లు ఆలమూరు శ్రీనివాసరెడ్డి, చింతా సోమశేఖరరెడ్డి తదితరులున్నారు.

మెరుగైన సేవలందించడమే లక్ష్యం

జగనన్న సురక్ష వైద్య శిబిరాలకు వచ్చే వారికి మెరుగైన చికిత్సలు అందించడమే లక్ష్యంగా పనిచేయాలని వైద్యులకు డీఎంహెచ్‌ఓ భ్రమరాంబదేవి సూచించారు. డీసీహెచ్‌ఎస్ డాక్టర్ పాల్ రవికుమార్‌తో కలసి మంగళవారం అనంతపురంలోని ఇందిరానగర్, కూడేరు మండలం గొట్కూరు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలను ఆమె పరిశీలించారు. ఓపీ సంఖ్యను అడిగి తెలుసుకున్నారు. హైరిస్క్ గర్భిణులకు అందజేస్తున్న చికిత్సపై ఆరా తీశారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారిని ఏపీ ఆస్పత్రులకు రెఫర్ చేశారో అడిగి తెలుసుకున్నారు. వైద్య శిబిరాలకు వస్తున్న వారి పట్ల సౌమ్యంగా వ్యవహరిస్తూ వారి అనుమానాలు నివృత్తి చేయాలని వైద్యులకు సూచించారు. అనంతరం రక్త పరీక్షల నిర్వహణ ప్రక్రియను పరిశీలించారు. డీఎంహెచ్‌ఓ వెంట ఎంహెచ్‌ఓ డాక్టర్ గంగాధరరెడ్డి, తదితరులు ఉన్నారు.

మంగళవారం అందించిన వైద్య సేవలు ఇలా...

మొత్తం వైద్య శిబిరాలు	29
ఓపీ సంఖ్య	4,894
రెఫరల్	307

ప్రభుత్వం మంచి చేస్తోంది



ప్రమాదంలో నాకు ఎడమకాలు విరిగింది. చికిత్స చేయించాను. అయినా కాలులో రక్తం గడ్డ కట్టింది. ఆరోగ్యశ్రీ కింద హైదరాబాద్‌లో ఆపరేషన్ చేశారు. ఇటీవల కడుపు ఉబ్బరంగా ఉంటూ బాధపడుతున్నా. ఇటీవల మా ఇంటి వద్దకే వలంటీర్, హెల్త్ డిపార్ట్‌మెంట్ వారు వచ్చి నా ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. ఈ రోజు ఇక్కడ జరిగే మెడికల్ క్యాంపునకు రావాలని చెప్పారు. మెడికల్ క్యాంప్ అంటే ఏదో సాదాసీదాగా ఉంటుందనుకున్నా. ఇక్కడికొచ్చి చేస్తూ ఏకంగా పెద్దాస్పత్రినే చూడగలిగాను. నా జబ్బుకు ఇక్కడే వైద్య పరీక్ష నిర్వహించారు. పరిస్థితి తీవ్రతను బట్టి జీజీహెచ్‌కు రెఫర్ చేశారు. ఇప్పటి వరకూ ఇలాంటి గొప్ప వైద్య సేవలను నేను చూడలేదు. మా ఆరోగ్యం బాగుండాలని మాకు చేరువలోనే మెడికల్ క్యాంప్‌లు ఏర్పాటు చేస్తున్న జగనన్న సర్కార్‌కు రుణపడి ఉంటాం.

– చాంద్‌బాషా, పెయింటర్, సోమనాథ్‌నగర్, అనంతపురం

మత్స్యకారులకు 75 శాతం రాయితీతో పథకాలు



మాట్లాడుతున్న డీడీ డాక్టర్ కె.శాంతి

అనంతపురం అగ్రికల్చర్: మత్స్యకార వర్గాలకు 75 శాతం రాయితీతో పథకాలు అమలు చేయనున్నట్లు ఆ శాఖ డీడీ డాక్టర్ కె.శాంతి తెలిపారు. మంగళవారం మత్స్యశాఖ కార్యాలయ ఆవరణలో మత్స్యకార సంఘం జిల్లాస్థాయి సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. డీడీ మాట్లాడుతూ ప్రధానమంత్రి మత్స్యసంపద యోజన, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో రూ.50 వేలు విలువ చేసే వలలు, తెప్పల పంపిణీకి అనుమతులు ఉన్నట్లు తెలిపారు. ఇందులో 75 శాతం రాయితీ పోనూ మిగతా 25 శాతం లబ్ధిదారులు భరిస్తే వాటిని సకాలంలో అందజేస్తామన్నారు. ఆసక్తి అర్హత కలిగిన వారు ఈ నెల 13లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనంతపురం, బీటీ ప్రాజెక్టు, ఎంపీ డ్యాం, పీఏబీఆర్ ఏడీలు, ధర్మవరం, కదిరి సహాయ పర్యవేక్షకులను సంప్రదించి సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ ఏడాది చేపపిల్లల పెంపకం, రిజర్వాయర్లకు ఉచితంగా పంపిణీ, అలాగే 40 శాతం రాయితీతో సహకార సంఘాలకు పంపిణీ, ఇతరత్రా సమస్యల గురించి చర్చించారు. సమావేశంలో ఎఫ్‌డీఓలు, సహకార సంఘాల అధ్యక్షులు, సభ్యులు పాల్గొన్నారు.

చాకర్లపల్లి రైల్వే గేటు మూసివేత

సోమందేపల్లి: రైల్వే ట్రాక్ పనుల దృష్ట్యా మండలంలోని చాకర్లపల్లి రైల్వే గేటును మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం సాయంత్రం 4 గంటల నుండి గురువారం ఉదయం 6 గంటల వరకూ గేటు తెరవమన్నారు. హిందూపురం–అనంతపురం వైపు రాకపోకలు జరిపేవారు పాలసముద్రం వైపు నుంచి వెళ్లాలని తహసీల్దార్ సురేష్ కుమార్, ఎస్‌ఐ విజయ్ కుమార్ సూచించారు.

మట్కా మానేదాకా దాడులు

• పోలీసు సిబ్బందికి ఎస్పీ ఆదేశం

అనంతపురం క్రైం: మట్కా మానేసేదాకా దాడులు కొనసాగించాలని ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ జారీ చేసిన ఆదేశాలు పోలీసు సిబ్బందిని పరుగులు పెట్టిస్తున్నాయి. ఇంతకాలం చూసీ చూడనట్లు వ్యవహరించిన పోలీసు అధికారులు, సిబ్బంది ప్రస్తుతం బీటర్ల కోసం అన్వేషణ సాగిస్తున్నారు. చెట్టూపుట్టా తిరిగి మరీ పట్టుకొస్తున్నారు. నిర్వాహకులు పక్కరాష్ట్రంలో తలదాచుకున్నా వదలడం లేదు. అక్కడి నుంచి 'అనంత'లో కార్యకలాపాలు కొనసాగిస్తుండటంతో పోలీసులు వారిని కూడా ఎరవేసి పట్టుకుంటున్నారు. మట్కా బీటర్లపై వరుస దాడులు చేయాల్సిందేనని ఎస్పీ గట్టి ఆదేశాలు చేయడంతో స్టేషన్ల వారీగా బీటర్లు, నిర్వాహకుల కదలికలపై ప్రత్యేక నిఘా సారించారు. వారెక్కడ తలదాచుకున్నా వెతికి మరీ పట్టుకుని న్యాయస్థానంలో హాజరు పరుస్తున్నారు. ఒక సారి తప్పు చేసి పోలీసులకు చిక్కిన వ్యక్తి తిరిగి అదే తప్పు చేసి దొరికితే కఠినంగా వ్యవహరించాలని జిల్లా ఎస్పీ సూచించారు. ప్రజల కష్టాన్ని జలగల్లా పీల్చుతున్న వారిని ఎట్టి పరిస్థితుల్లో వదలొద్దని ఆదేశించారు.

ఏకకాలంలో దాడులు..

అనంతపురం పోలీసు సబ్ డివిజన్ పరిధిలోని నాలుగు స్టేషన్ల పోలీసులు సోమవారం రాత్రి ఏకకాలంలో మట్కా బీటర్లు, నిర్వాహకులపై దాడులు చేశారు. సుమారు 16 మందిని అదుపులోకి తీసుకున్నారు. అదుపులోకి తీసుకున్న వారిని మంగళవారం న్యాయస్థానంలో హాజరు పరిచేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

'జీడిపల్లి' నుంచి నీరు విడుదల



స్విచ్ ఆన్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

బెళుగుప్ప: మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్ సమీపంలో ఉన్న అంకంపల్లి పంపుహౌస్ నుంచి హంద్రీ–నీవా కాలువల ద్వారా శీర్పి, బెళుగుప్ప చెరువులకు మంగళవారం నీటిని విడుదల చేశారు. మోటార్ల వద్ద ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి, స్విచ్ఛాన్ చేశారు. అనంతరం హంద్రీ–నీవా ఈఈ రామకృష్ణయాదవ్, డీఈ శ్రీనివాసనాయక్‌తో కలసి హంద్రీ–నీవా కాలువలో గంగపూజ చేసి, హారతులు ఇచ్చారు. ఈ సందర్భంగా విశ్వ మాట్లాడుతూ... రైతుల సంక్షేమమే ధ్యేయంగా జగన్ సర్కార్ పనిచేస్తోందన్నారు. హంద్రీ–నీవా ప్రాజెక్టు ద్వారా నియోజకవర్గంలోని అన్ని చెరువులకూ నీటిని అందించడం ద్వారా భూగర్భ జలాలు పెంపొంది ఈ ప్రాంతం సస్యశ్యామలంగా మారుతోందన్నారు. అంకంపల్లి 9వ నంబర్ పంపుహౌస్ నుంచి 120 క్యూసెక్కులు చొప్పున 10 నంబర్‌కు, అక్కడి నుంచి హంద్రీ–నీవా కాలువ ద్వారా శీర్పి, బెళుగుప్ప చెరువులకు నీటిని అందజేసేలా చర్యలు తీసుకున్నట్లు అధికారులు వివరించారు. కార్యక్రమంలో హంద్రీ–నీవా ఏఎం అజమ్, ఏఈ అందామ్, ఏఈఈ ఇంద్రసేన్, ఎంపీపీ పెద్దన్న, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజినేయులు, బెళుగుప్ప సహకార సంఘం అధ్యక్షుడు శివలింగప్ప, జేసీఎస్ మండల కన్వీనర్ శ్రీనివాస్, పార్టీ మండల కన్వీనర్ మచ్చన్న, సర్పంచ్ రుద్రానంద, ఎంపీటీసీ సభ్యులు వీరబల్మన్న, ప్రభావతి, నాయకులు శ్రీనివాసరెడ్డి, గోపాల్, కరుణాకర్, దేవనాథ్‌రెడ్డి, అశోక్, వెంకటరెడ్డి, పాతన్న, పురుషోత్తంరాజు, గోవిందరెడ్డి, బాబు, శంకర్‌రెడ్డి, హనుమంతురాయుడు, తదితరులు పాల్గొన్నారు.

అమెరికా సంస్కృతి ఎలా ఉంది?



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న విద్యార్థిని సౌమ్య, డీఈఓ నాగరాజు

అనంతపురం ఎడ్యుకేషన్: మన సంస్కృతికి, అమెరికా సంస్కృతికి ఏమైనా తేడాలు గమనించారా? అంటూ ఇటీవల ప్రభుత్వం తరఫున అమెరికా పర్యటనకు వెళ్లొచ్చిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను రాప్తాడు కేజీబీవీ 9వ తరగతి విద్యార్థిని సౌమ్య ప్రశ్నించింది. ఇంగ్లిష్‌లో ప్రతిభ ఆధారంగా ఎంపిక చేసిన పది మంది ప్రభుత్వ పాఠశాలల పదో తరగతి విద్యార్థులను ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం అమెరికా పర్యటనకు పంపిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో విదేశీ పర్యటన ముగించుకుని తిరిగొచ్చిన వారితో అక్కడి అనుభవాలను ఇతర విద్యార్థులతో పంచుకునేలా మంగళవారం అన్ని జిల్లాల విద్యార్థులతో వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేశారు. ప్రతి జిల్లా నుంచి ఒక విద్యార్థిని ఎంపిక చేశారు. ఇందులో భాగంగా అనంతపురం నుంచి రాప్తాడు కేజీబీవీ విద్యార్థిని ఆర్.సౌమ్య పాల్గొంది. డీఈఓ చాంబరులో డీఈఓ నాగరాజు, సమగ్రశిక్ష ఏఎంఓ చంద్రశేఖర్‌రెడ్డి కూడా పాల్గొన్నారు. అమెరికాలో ఐక్యరాజ్య సమితి కార్యాలయం, లిబర్టీ ఆఫ్ స్టాచ్యూ, వైట్‌హౌస్, వరల్డ్‌బ్యాంక్ తదితర కార్యాలయాలను సందర్శించి వచ్చినట్లు విద్యార్థులు పేర్కొన్నారు. ఇతర దేశాల నుంచి వచ్చిన విద్యార్థులతో ఇంట్రాక్ట్ అయినట్లు వెల్లడించారు. జిల్లా విద్యార్థిని అడిగిన ప్రశ్నకు జవాబిస్తూ... అక్కడి దేశస్తులు తమను బాగా రిసీవ్ చేసుకున్నారన్నారు. అక్కడ తమ అనుభవాలను పంచుకున్నారు. డీఈఓ నాగరాజు మాట్లాడుతూ విద్యార్థుల్లో స్ఫూర్తి నింపే ఇలాంటి కార్యక్రమాలు చాలా ఉపయోగకరంగా ఉంటాయన్నారు.

సర్టిఫికెట్ల పరిశీలన తొలిరోజు ప్రశాంతం

సమగ్ర శిక్ష సహిత విద్య విభాగంలో ఖాళీగా ఉన్న రిసోర్స్ పర్సన్ పోస్టులకు దరఖాస్తు చేసుకొన్న అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన తొలిరోజు మంగళవారం ప్రశాంతంగా జరిగింది. సమగ్రశిక్ష జిల్లా కార్యాలయంలో ఈ ప్రక్రియ సాగింది. రాష్ట్ర కార్యాలయం నుంచి వచ్చిన జాబితా మేరకు తొలిరోజు ఎంఆర్ అభ్యర్థుల సర్టిఫికెట్లను ఎంఈఓలు, హెచ్‌ఎంల బృందాలు పరిశీలించాయి. మొత్తం 144 మంది అభ్యర్థులకు గాను 120 మంది హాజరయ్యారు. సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియను సమగ్రశిక్ష ఏపీసీ, డీఈఓ నాగరాజు, ఐఈడీ కోఆర్డినేటర్ షమా పరిశీలించారు. రెండోరోజు బుధవారం వీఐ/హెచ్ఐ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతుందని డీఈఓ తెలిపారు. దరఖాస్తు సమయంలో సమర్పించిన సర్టిఫికెట్లు రెండుసెట్లు గెజిటెడ్ అధికారి ధ్రువీకరణతో పాటు ఆన్‌లైన్ దరఖాస్తు కాపీ తీసుకురావాలని సూచించారు.

మిత్రుడి కుమార్తెపై అత్యాచారయత్నం

• నాలుగేళ్ల తర్వాత దిశ పోలీసులకు బాధితురాలి ఫిర్యాదు
• నిందితుడి అరెస్ట్... రిమాండ్‌కు తరలింపు

అనంతపురం క్రైం: నాన్నతో కలసి ఆయన మిత్రుడు ఇంటికొస్తే ఆత్మీయంగా పలకరించి అన్నం పెట్టిన వివాహితపై కన్నేశాడు ఓ కామాంధుడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆమెపై అత్యాచారం చేయబోయాడు. గట్టిగా ప్రతిఘటించడంతో గుట్టుచప్పుడు కాకుండా వెళ్లిన ఆ దుర్మార్గుడు.. చివరకు ఆమె భర్తకు దగ్గరై లోబర్చుకునేందుకు ఎత్తుగడ వేశాడు. దీంతో విషయం కాస్త భర్తకు తెలిసి భార్యకు దూరమయ్యాడు. పండంటి కాపురం కూలిపోయాక అసలు విషయాన్ని దిశ పోలీసులో బాధితురాలు మొరబెట్టుకుంది. వివరాలు...

అనంతపురంలోని లక్ష్మీనగర్‌కు చెందిన ఓ కుటుంబ పెద్దకు కరుడు కట్టిన నేరస్తుడు టెంకాయల రాము స్నేహితుడు. ఈ స్నేహాన్ని అడ్డుపెట్టుకుని తరచూ వారి ఇంటికి రాము వెళ్లేవాడు. ఈ క్రమంలోనే ఆ కుటుంబంలోని యువతికి తల్లిదండ్రులు పెళ్లి చేసి, అల్లుడిని ఇల్లరికం తెచ్చుకున్నారు. అయితే స్నేహితుడి కుమార్తెపై కన్నేసిన రాము.. ఎలాగైనా ఆమెను లోబర్చుకోవాలని అవకాశం కోసం ఎదురు చూస్తూ వచ్చాడు.


2018లో ఘటన

2018, డిసెంబర్ 14న ఉదయం వివాహిత భర్త పనిపై బయటకు వెళ్లాడు. ఆ సమయంలో ఇంటికి చేరుకున్న టెంకాయల రాము... ఆమె ఒంటరిగా ఉన్నట్లు నిర్ధారించుకుని, తనకు మంచినీళ్లు కావాలని అడిగాడు. నీళ్లు తెచ్చిచ్చిన ఆమె ఫోన్ కోసం పడకగదిలోకి వెళ్లగా వెనుకనే అనుసరించిన రాము బలాత్కరించబోయాడు. ఆ సమయంలో ఆమె గట్టిగా ప్రతిఘటించడంతో అక్కడి నుంచి ఉడాయించాడు. బయటకు వెళ్లిన తల్లిదండ్రులు ఇంటికి చేరుకున్న తర్వాత జరిగిన విషయం మొత్తం వారితో బాధితురాలు చెప్పుకుని ఏడ్చింది. అయితే రాము కరుడు కట్టిన నేరస్తుడు కావడంతో విషయం వివాదస్పదమైతే తమ ప్రాణాలకే ప్రమాదమని భావించిన కుటుంబసభ్యులందరూ బయటకు చెప్పుకోలేక లోలోనే మదనపడుతూ వచ్చారు. ఈ విషయం భర్తకు తెలిస్తే ఆయన ఎక్కడ అపార్థం చేసుకుని దూరమవుతాడోననే భయం కూడా వారిని వెన్నాడుతూ వచ్చింది.

విషయం తెలిసి దూరమైన భర్త

ఎలాగైనా స్నేహితుడి కుమార్తెను లోబర్చుకోవాలనుకున్న రాము.. చివరకు ఆమె భర్తకు సన్నిహితమవుతూ వచ్చాడు. ఇటీవల ఈ విషయాన్ని గమనించిన ఆమె వెంటనే తన భర్తను హెచ్చరిస్తూ రాముతో కలసి తిరగడం మంచిది కాదని హితవు చెప్పింది. రాము చేసిన దురాగతాన్ని తల్లిదండ్రులతో కలసి వివరించింది. ఆపత్కాలంలో బాధితురాలికి అండగా నిలవాల్సిన భర్త ఆమెను అపార్థం చేసుకున్నాడు. ఆ రోజునే ఆమెకు దూరమయ్యాడు. నీచుడి ప్రవర్తన కారణంగా తన సంసారం కుప్పకూలడంతో తీవ్ర వేదనకు లోనైన బాధితురాలు గత నెల 25న దిశ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సీఐ చిన్నగోవిందు... సిబ్బంది సాయంతో మంగళవారం ఉదయం శ్రీసత్యసాయి జిల్లా తలుపులలో టెంకాయల రామును గుర్తించి అరెస్ట్ చేశారు. కేసు నమోదు చేసి న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

ప్రకృతి సేద్యాన్ని పరిశీలించిన జర్మనీ బృందం



క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్న జర్మనీ బృందం సభ్యులు, రైతులు

తాడిపత్రి: ప్రకృతి వ్యవసాయంపై అధ్యయనం చేసేందుకు వచ్చిన జర్మనీ బృందం మంగళవారం తాడిపత్రి మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించింది. ఈ సందర్భంగా వారి వెంట జెడ్పీబీఎన్ఎఫ్ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ లక్ష్మానాయక్ ఉన్నారు. యర్రగుంటపల్లి యూనిట్ పరిధిలోని రావి వెంకటాంపల్లి, బొందలదిన్నె గ్రామాల్లో రైతులు కొండయ్య, బాబు, సత్యనారాయణ రావు, ఆవుల కొండారెడ్డి, ప్రహ్లాదరెడ్డికు చెందిన పొలాలను పరిశీలించారు. బీడు భూమిలో పత్తి పంటను సాగు చేసిన తీరును అక్కడి రైతులను అడిగి తెలుసుకున్నారు. ప్రకృతి వ్యవసాయ విధానాలపై ఆరా తీశారు. బీజామృతం, విత్తన శుద్ధి, ద్రవ, ఘన జీవామృతం తయారీ, సోయింగ్ తదితర అంశాలను ఆసక్తిగా గమనించారు. కార్యక్రమంలో నెదర్లాండ్స్‌కు చెందిన ఏహెచ్‌టీ కన్సల్టెంట్ సెర్పి నబూర్స్, జర్మనీకి చెందిన ప్రాజెక్ట్ మేనేజర్ అస్తైత్ హిట్జ్, హైదరాబాద్‌కు చెందిన డెలాయిట్ వైది గోహిల్, పులివెందులకు చెందిన ఐజీజీఏఆర్ఎల్ అకాడమి డాక్టర్ సందీప్, డాక్టర్ శుభకర్, ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ మహమ్మద్ సొహైల్, ఎంటీ, ఎంఏ, ఏపీ సీఎన్ఎఫ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రెండు దుకాణాల్లో చోరీ

గుత్తి: పట్టణంలోని రెండు షాపుల్లో దుండగులు చొరబడి విలువైన కంప్యూటర్ హార్డ్ డిస్క్, నగదు అపహరించుకెళ్లారు. పోలీసులు తెలిపిన మేరకు... గుత్తి - అనంతపురం మార్గంలోని ఎస్‌బీఐ శాఖ ఎదురుగా ఉన్న ఓ ఎలక్ట్రికల్ షాపులో సోమవారం రాత్రి దుండగులు చొరబడి రూ.25 అపహరించారు. బాధితుడు అశోక్ కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అలాగే గుంతకల్లు రోడ్డులోని ఫర్టిలైజర్ దుకాణంలో దుండగులు చొరబడి రూ. 5 వేలు నగదుతో పాటు కంప్యూటర్ హార్డ్ డిస్క్ ఎత్తుకెళ్లారు. బాధితుడు వెంకటరామిరెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

యువకుడి దుర్మరణం



ప్రకాష్ (ఫైల్)

రాయదుర్గంటౌన్: గుర్తు తెలియని వాహనం దూసుకెళ్లిన ఘటనలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... రాయదుర్గంలోని వాల్మీకి నగర్‌కు చెందిన గురుమూర్తి ఏకైక కుమారుడు ప్రకాష్ (23) కుటుంబసభ్యులతో కలసి బెంగళూరుకు చేరుకుని అక్కడే అట్టల తయారీ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు. బంధువుల ఇంట శుభకార్యం ఉండడంతో రెండు రోజుల క్రితం రాయదుర్గంలోని స్వగృహానికి వచ్చాడు. ఈ క్రమంలో వ్యక్తిగత పనిపై మంగళవారం సాయంత్రం 4 గంటలకు ద్విచక్రవాహనంపై వెళుతున్న ప్రకాష్‌ను బీజీ తిలక్ మున్సిపల్ హైస్కూల్ ఎదురుగా అదుపు తప్పి రోడ్డుపై పడ్డాడు. అదే సమయంలో వెనుకనే వేగంగా వస్తున్న వాహనం అతని మీదుగా దూసుకెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ వాహనాన్ని నిలపకుండా ముందుకెళ్లిపోయాడు. ఘటనపై రాయదుర్గం పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వ సహకారం : జేసీ

గుత్తి రూరల్: పరిశ్రమలు, గనులు ఏర్పాటు చేసే వారికి ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్ అన్నారు. గుత్తి మండలం కరిడికొండ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 378లో ఏర్పాటు కానున్న రోడ్డు మెటల్, బిల్డింగ్ స్టోన్స్, ఎం.ఇసుక క్వారీకి సంబంధించి మంగళవారం ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. క్వారీ ఏర్పాటు అంశంపై కరిడికొండ, బాచుపల్లి, వన్నేదొడ్డి గ్రామాల ప్రజలతో తహసీల్దార్ మహబూబ్‌బాషాతో కలసి ఆయన సంప్రదించారు. 4 హెక్టార్లలో క్వారీని ఏర్పాటు చేసేందుకు నిర్వాహకులు ముందుకు వచ్చారని, ప్రజాభిప్రాయం మేరకే వారికి అనుమతులు జారీ చేస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ... క్వారీలో స్థానికులనే పనిలో పెట్టుకోవాలని సూచించారు. పంట పొలాలకు నష్టం వాటిల్లకుండా క్వారీ నిర్వహించుకుంటే తమకెలాంటి అభ్యంతరం లేదన్నారు. గ్రామాల్లో అభివృద్ధి పనులకు సహకరించాలన్నారు. ప్రతి నెలా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి పెద్ద ఎత్తున మొక్కలు నాటి సంరక్షించేలా చర్యలు తీసుకోవాలని ఎన్‌జీఓ సంఘాలు కోరాయి. బ్లాస్టింగ్ సమయంలో గ్రామాల్లో దండోరా వేయించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ రమేష్, కార్యదర్శి ప్రవీణ్, ఏపీపీసీబీ ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ కిషోర్‌రెడ్డి, ఏఈఈ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

గొర్రెకు 'సిజేరియన్'!

శింగనమల: ప్రసవ వేదనతో ఇబ్బంది పడుతున్న గొర్రెకు సకాలంలో సిజేరియన్ ఆపరేషన్ చేసి పిల్లను వెలికి తీసి తల్లి గొర్రె ప్రాణాలు కాపాడిన అరుదైన ఘటన శింగనమల పశువైద్యశాలలో చోటు చేసుకుంది. వివరాలు.. శింగనమలకు చెందిన రామాంజనేయులు, నారాయణస్వామి గొర్రెల పోషణతో జీవనం సాగిస్తున్నారు. గర్భం దాల్చి నెలలు నిండిన వీరి మందలోని ఓ గొర్రె మంగళవారం ప్రసవం కాక ఇబ్బంది పడుతుంటే వెంటనే స్థానిక పశువైద్యశాలకు తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు గర్భంలోనే పిల్ల మృతి చెందినట్లుగా నిర్ధారించారు. సిజేరియన్ చేసి మృత గొర్రెపిల్లను వెలికి తీస్తే తప్ప తల్లి గొర్రె ప్రాణాలు దక్కవని కాపర్లకు తెలిపి ఆపరేషన్‌కు చర్యలు తీసుకున్నారు. పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ పద్మనాభం, డాక్టర్ రజియా బేగం, లైవ్‌స్టాక్ అసిస్టెంట్ చంద్రశేఖర్ దాదాపు అర గంటకు పైగా శ్రమించి మృతి చెందిన గొర్రెపిల్లను వెలికి తీశారు. తల్లి గొర్రె సురక్షితంగా ఉందని ప్రకటించడంతో పశువైద్యులకు కాపర్లు కృతజ్ఞతలు తెలిపారు.

క్లుప్తంగా

ఈ క్రాప్ నమోదును సరిచూసుకోండి


రైతులతో మాట్లాడుతున్న అధికారులు

ఆత్మకూరు: ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలు ఈ క్రాప్ నమోదును సరిచూసుకోవాలని ఏఓ సుచరిత రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని వేపచెర్ల,వేపచెర్ల ఎగువ తండా, దిగువ తండా గ్రామాల్లో పర్యటించారు. రైతులతో గ్రామ సభలు నిర్వహించారు. రైతులతో మాట్లాడుతూ ఈక్రాప్ బుకింగ్ చేసుకోని రైతులు ఈ క్రాప్ బుకింగ్ చేయించుకోవాలన్నారు. వ్యవసాయ సిబ్బంది ఏఈఓ సుజిత, ఎంపీఈఓలు నాగమణి, దాదావలి, ఆషు,భారతి, వీఎస్‌ఏ రూపేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు రవి నాయక్, కృష్ణానాయక్, యల్లప్ప పాల్గొన్నారు.

నీటిశుద్ధిని పరిశీలించిన మేయర్


నీటిశుద్ధిని పరిశీలిస్తున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని 12వ డివిజన్‌లో మేయర్ వసీం పర్యటించారు. నీటిశుద్ధిని పరిశీలించారు. ముద్దలాపురం నీటి శుద్ధి కేంద్రంలో 16 ఎంఎల్‌డీ సామర్థ్యంతో కొత్తగా నీటి శుద్ధి కేంద్రాన్ని పూర్తి చేయడంలో భాగంగా ఇంటర్ కనెక్టివిటీ పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. నగరపాలక సంస్థ అందించే నీటిని కాచి, చల్లారాక వడపోసి తాగాలన్నారు. కార్పొరేటర్ బాబాఫక్రుద్దీన్, మార్కెట్‌యార్డు డైరెక్టర్ మంజునాథ్, ఈఈ సూర్యనారాయణ, డీఈ సుభాష్ చంద్రబోస్ పాల్గొన్నారు.

ఆలమూరు లే అవుట్ పరిశీలన

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థ కమిషనర్ భాగ్యలక్ష్మి మంగళవారం ఆలమూరు లే అవుట్‌ను పరిశీలించారు. ఇంటి నిర్మాణాల ప్రక్రియను వేగవంతం చేయాలని కాంట్రాక్టర్, అధికారులను ఆదేశించారు. నాణ్యత ప్రమాణాలను పాటించాలని తెలిపారు.

నేడు వేలంపాట

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థ కార్యాలయంలో కొత్తూరు న్యూ షాపింగ్ కాంప్లెక్స్‌లోని గదుల లీజుకు సంబంధించి బుధవారం ఉదయం 11 గంటలకు వేలం ఉంటుందని కమిషనర్ భాగ్యలక్ష్మి తెలిపారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు.

వైద్యసిబ్బందికి సన్మానం


వైద్య సిబ్బందిని సన్మానిస్తున్న డాక్టర్ శివకృష్ణ

రాప్తాడు: రాప్తాడు పీహెచ్‌సీ ఎఫ్‌ఎన్‌ఓ దేవయాని, కాంపౌండర్ లక్ష్మీని వైద్యాధికారి శివకృష్ణ మంగళవారం సన్మానించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'మాంటిస్సోరి'లో ఈపీఎల్



విద్యార్థులతో స్కూల్ కరస్పాండెంట్

అనంతపురం ఎడ్యుకేషన్: నగరంలోని సంగమేష్‌నగర్‌లోని మాంటిస్సోరి పాఠశాలలో మంగళవారం ఇంగ్లిష్ ప్రీమియర్ లీగ్ (ఈపీఎల్) నిర్వహించారు. ఇందులో భాగంగా 1-10 తరగతుల విద్యార్థులను నాలుగు గ్రూపులుగా విభజించి వారికి భాషా సంబంధించిన వ్యాకరణం, పదజాలం, ఉచ్చారణ, ఫొనెటిక్స్, ఫొనెటిక్ ట్రాన్స్‌క్రిప్షన్‌కు సంబంధించి వివిధ అంశాలపై వివిధ దశల్లో నిర్వహించిన రాత, మౌఖిక పోటీలు నిర్వహించారు. విజేతలకు మాంటిస్సోరి విద్యా సంస్థల అధినేత సి.సూర్యనారాయణరెడ్డి చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు, బహుమతులు అందించారు. పాఠశాల కార్యదర్శి కె.మాధవి, ప్రిన్సిపాల్ కె.పద్మావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

5 నుంచి అండర్-19 ఎస్‌జీఎఫ్ ఎంపికలు

అనంతపురం: ఈ నెల 5వ తేదీ నుంచి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో అండర్ 19 విభాగంలో క్రీడాకారుల ఎంపిక చేపట్టనున్నారు. ఈ మేరకు ఎస్‌జీఎఫ్ సెక్రటరీ లక్ష్మీనారాయణ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 5వ తేదీ నుంచి 9వ తేదీ వరకూ ఎంపిక ప్రక్రియ ఉంటుంది. 2005, జనవరి 1 తర్వాత జన్మించిన వారు అర్హులు. పదో తరగతి మార్కుల మెమోపై ప్రిన్సిపాల్ సంతకం, అడ్మిషన్ నంబర్‌తో ఎంపికలకు హాజరు కావాలి. కళాశాలలో చదువుతున్న విద్యార్థులు స్టడీ సర్టిఫికెట్, ఎస్‌జీఎఫ్ ఎంట్రీ ఫామ్‌తో హాజరుకావచ్చు. క్రికెట్ క్రీడకు సంబంధించి అనంతపురంలోని పీటీసీ మైదానంలో ఈ నెల 6వ తేదీ ఎంపికలు ఉంటాయి. అలాగే అనంతపురంలోని అశోక్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఈ నెల 7న ఫెన్సింగ్, ఆర్చరీ, రైఫిల్ షూటింగ్, రెజ్లింగ్, ఈ నెల 9న ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జూడో, రోప్ స్కిప్పింగ్, రగ్బీ క్రీడల్లో ప్రతిభావంతులను ఎంపిక చేయనున్నారు.

ప్రభుత్వ స్థలంపై కమ్యూనిస్ట్ కన్ను

- సీపీఐ నాయకుల పేరుతో 8 సెంట్ల స్థలం కబ్జా
- అనంతపురం రూరల్ మండలం పిల్లిగుండ్లకాలనీలో అరాచకం


2021లో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన దృశ్యం (ఫైల్)


పక్కకు తోసేసిన ఆంజనేయస్వామి విగ్రహానికి మొక్కుతున్న స్థానికులు

రాప్తాడురూరల్: పేదల హక్కుల కోసం పోరాడే వాళ్లే కబ్జాలకు తెగబడుతున్నారు. అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లి కాలనీ పంచాయతీ పిల్లిగుండ్లకాలనీలో రూ.కోటి విలువజేసే 8 సెంట్ల స్థలంపై కన్నేశారు. రెవెన్యూ అధికారులు జోక్యం చేసుకొని నోటీసులు జారీ చేసి, బోర్డులు ఏర్పాటు చేసినా లెక్కచేయలేదు. దీంతో స్థానికులు తిరగబడడంతో కథ అడ్డం తిరిగింది. పిల్లిగుండ్లకాలనీకి చెందిన బిస్కెట్ వెంకటేశ్, ఈడిగ సూరి, ఈడిగ శేఖర్, ఆనంద్‌రెడ్డి, రవి, సూర్యనారాయణరెడ్డి, రమేష్, రాములమ్మ, లక్ష్మీదేవి, వరాలమ్మ, అరుణమ్మ, జానకమ్మ, జహరున్‌బీ, అంజినమ్మ, వరలక్ష్మి, మంగమ్మ, జయమ్మ తదితరులు తెలిపిన మేరకు.. కక్కలపల్లి పొలం సర్వే నంబరు - 1 పిల్లిగుండ్లకాలనీలో 1995లో సీపీఐ నాయకులు పేదలకు గుడిసెలు వేయించారు. 1996లో దాదాపు 178 మందికి ఒక్కొక్కరికి రెండు సెంట్లు చొప్పున ప్రభుత్వం పట్టాలు మంజూరు చేసింది. ప్రజా ఉపయోగార్థం 8 సెంట్ల స్థలాన్ని వదిలారు. ప్లాన్‌లో కూడా స్పష్టంగా పొందుపరిచారు. 4 సెంట్ల స్థలంలో సీపీఐ కార్యాలయం నిర్మించారు. మిగిలిన 4 సెంట్ల స్థలంలోఆలయ నిర్మాణం కోసం తీర్మానం చేసి, ఆంజనేయస్వామి బొమ్మ చెక్కి ఉన్న బండ ఏర్పాటు చేశారు. తర్వాత భూముల విలువ బాగా పెరగడంతో స్థానికంగా ఉండే సీపీఐ నాయకులు రఘురామయ్య, గోవిందు తదితరుల కన్నుపడింది. వీరికి కొందరు సీపీఐ కీలక నాయకులు సహకరించారు. 2008లో ఇద్దరికి, 2013 ఒకరికి రెవెన్యూ అధికారులు పట్టాలు మంజూరు చేసినట్లు సృష్టించుకున్నారు. పట్టాల ఆధారంగా 2020లో ఆ స్థలంలోకి అడుగుపెట్టాలని ప్రయత్నించగా, స్థానికులు అడ్డుకున్నారు. రెవెన్యూ అధికారులు రంగ ప్రవేశం చేసి, విచారణలో సదరు పట్టాలు తమ రికార్డుల్లో లేవని తేల్చారు. 2020 నంబరు 13న హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఎవరైనా అన్యాక్రాంతం చేసినా, ఆక్రమించినా చర్యలుంటాయని హెచ్చరికలు జారీ చేసిన కొద్దిరోజుల్లోనే బోర్డును కబ్జాదారులు తొలగించారు. రెవెన్యూ అధికారులు 2021 ఆగస్టు 21న మరోమారు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డును తొలిగించేశారు. మంగళవారం ఉదయమే ఆంజనేయస్వామి విగ్రహాన్ని పక్కకు తీసేశారు. దీంతో స్థానికులు గొడవపడ్డారు. పోలీసులు ఇరువర్గాలవారిని విచారించారు. 8 సెంట్లస్థలానికి సంబంధించి రెవెన్యూ అధికారులకు రాశామని, తర్వాత చర్యలు తీసుకుంటామని సీఐ రామకృష్ణారెడ్డి స్పష్టం చేశారు.


ప్లాన్‌లో 'ఓపెన్ స్పేస్'గా గుర్తించిన 8 సెంట్ల భూమి

రికార్డుల్లో లేదు

పిల్లిగుండ్లకాలనీలోని 8 సెంట్ల ప్రభుత్వ స్థలానికి పట్టాలిచ్చినట్లు మా రికార్డుల్లో ఎక్కడా లేదు. దీంతో 2020 నవంబరులో ఒకసారి, 2021 ఆగస్టులో మరోసారి సదరు స్థలంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశాం. వాటిని తొలగించారు. పోలీసులకు ఫిర్యాదు కూడా చేశాం.

– ప్రేమ్‌సింహ, వీఆర్‌ఓ

ఎస్పీని కలిసిన టీటీడీ బోర్డు సభ్యుడు


ఎస్పీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న అశ్వర్థనాయక్

అనంతపురం క్రైం: జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్‌ను తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యుడు అశ్వర్థనాయక్ మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. టీటీడీ బోర్డు సభ్యుడిగా ఎన్నికైన అశ్వర్థనాయక్‌కు ఎస్పీ శుభాకాంక్షలు తెలియజేశారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష

రాప్తాడు: మండలంలోని గొందిరెడ్డిపల్లిలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సాల్మన్, వైద్యాధికారి శ్రావణి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

పింఛన్ 96.48 శాతం పంపిణీ

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థలోని వివిధ డివిజన్లలో మంగళవారం నాటికి 96.48 శాతం పింఛన్ పంపిణీ జరిగింది. ఈ నెల 1 నుంచి పింఛన్ పంపిణీ జరిగింది. మొత్తం 23,584 పింఛన్లు (మొత్తం రూ.6,62,98,250) కాగా, అందులో 22754 పింఛన్లు (రూ.6,39,36,750) పంపిణీ చేశారు. ఇంకా కేవలం 830 పింఛన్లు మాత్రమే పెండింగ్ ఉన్నాయి. మరో రెండ్రోజుల్లో వాటిని పూర్తి చేయనున్నారు.

ఉచిత వాటర్‌ప్లాంట్ ప్రారంభం


తాగునీటి కొళాయిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం రాచానపల్లి సర్పంచ్ బండా అంజి యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత ప్లాంట్‌ను రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి మంగళవారం ప్రారంభించారు. పంచాయతీ పరిధిలోని బీఎస్‌ఆర్ కాలనీలో సర్పంచ్ దాదాపు రూ. 7 లక్షల ఖర్చుతో ఈ ప్లాంట్ ఏర్పాటు చేశారు. సర్పంచ్ అంజియాదవ్‌ను ఎమ్మెల్యే అభినందించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత రాచానపల్లి పంచాయతీ అభివృద్ధిలో పరుగులు పెడుతోందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వరలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్, వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు గంగుల భానుమతి, ధనుంజయాదవ్, రాచానపల్లి పీఏసీఎస్ చైర్మన్ గుగ్గిళ్ల జయకృష్ణారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు గౌస్, మాజీ ఎంపీపీ సూర్యనారాయణరెడ్డి, రామచంద్రారెడ్డి, రామకృష్ణారెడ్డి, బాలకృష్ణ, స్టోర్ డీలర్ అంజి తదితరులు పాల్గొన్నారు.

పీఎఫ్ మంజూరులో నిబంధనలు పాటించండి


డిప్యూటీ సీఈఓ లలితాబాయి, పీఎఫ్ సెక్షన్ ఏఓలతో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

అనంతపురం సిటీ: జెడ్పీ ఉద్యోగ, ఉపాధ్యాయుల పీఎఫ్ మంజూరులో నిబంధనలు పాటించాలని జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ ఉద్యోగులను ఆదేశించారు. జెడ్పీలోని తన చాంబర్‌కు డిప్యూటీ సీఈఓ లలితాబాయి, పీఎఫ్ విభాగం పరిపాలనాధికారులు ఉషాకుమారి, శ్రీనివాసులరెడ్డిని పిలిపించి మాట్లాడారు. పీఎఫ్ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి 75 శాతం కాకుండా 50 శాతం మాత్రమే మంజూరు చేయాలని మీకు ఎవరు చెప్పారని చైర్‌పర్సన్ ఏఓలను ప్రశ్నించారు. డిప్యూటీ సీఈఓ ఆదేశాల మేరకే తాము అలా చేశామని వారు బదులిచ్చారు. ఇన్‌చార్జ్ సీఈఓ కేతన్‌గార్గ్ ఆదేశాల మేరకే తాను కింది స్థాయి సిబ్బందికి అలా చెప్పానని డిప్యూటీ సీఈఓ సమాధానమిచ్చారు. అనంతరం ఏ సెక్షన్ ఉద్యోగులను సాయంత్రం తన చాంబర్‌కు పిలిపించి గట్టిగా మందలించారు. తనకు తెలియకుండా కొందరు ఉద్యోగులకు సెక్షన్లు మార్చడంపైనా అసహనం వ్యక్తం చేశారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే న్యాయం


కళ్లద్దాలు పంపిణీ చేస్తున్న తోపుదుర్తి ఆత్మారామిరెడ్డి

ఆత్మకూరు: వైఎస్సార్‌సీపీ అధికారంలోకొచ్చిన తర్వాతనే ప్రజలకు న్యాయం జరుగుతోందని పి.యాలేరు బ్యాంక్ సొసైటీ ప్రెసిడెంట్ తోపుదుర్తి ఆత్మారామిరెడ్డి అన్నారు. మంగళవారం తోపుదుర్తి గ్రామంలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీలతో సంబంధం లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందుతున్నాయన్నారు. అనంతరం వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా కంటి సమస్యలున్న వారికి కళ్లద్దాలు అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ హేమలత, జిల్లా అధికార ప్రతినిధి చంద్రశేఖర్‌రెడ్డి ,సర్పంచ్ ఓబులేష్, ఎంపీటీసీ పోతులయ్య, వైస్ ఎంపీపీలు విజయ్, నీలిమ మండల వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పూజారి లక్ష్మీనరసింహులు, యూత్ కన్వీనర్ గూలి కొండారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు గోపాల్‌రెడ్డి, ఆతికిరెడ్డి, జేసీఏ కన్వీనర్ వడ్డుపల్లి నరసింహారెడ్డి, డాక్టర్ దయాకర్ , ఎంపీడీఓ రఘునాథ్, ఆశావర్కర్లు, గ్రామ సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష.. పేదలకు శ్రీరామరక్ష


రాప్తాడు: గాండ్లపర్తిలో కంటి పరీక్షలను పరిశీలిస్తున్న ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి

రాప్తాడు: గ్రామీణ ప్రాంతాల పేదలకు జగనన్న ఆరోగ్య సురక్ష శ్రీరామరక్ష అని ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం గాండ్లపర్తి గ్రామంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. మెడికల్ క్యాంపు వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాళ్లను ఎంపీపీ పరిశీలించారు. ఎంపీపీ మాట్లాడుతూ పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉండొచ్చన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి ఉమామహేశ్వరమ్మ, ఎంపీడీఓ సాల్మన్, ఈఓఆర్డీ నరసింహారెడ్డి, వైద్యాధికారి శివకృష్ణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నాగరత్న, హేమలత, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, యూత్ మండల కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు డొక్కా రామచంద్ర, గవ్వల నల్లప్ప, చిన్న కృష్ణారెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి , ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

అనంతపురం మెడికల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న వైద్యశిబిరాల్లో దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులను గుర్తించి, కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచితంగా చికిత్సలు చేయించేలా చర్యలు తీసుకున్నట్లు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. మంగళవారం నగరంలోని ఇందిరానగర్‌లోని ఎన్‌టీఆర్ పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. రిజిస్ట్రేషన్ మొదలుకొని గైనిక్, జనరల్ మెడిసిన్, సర్జరీ, కంటి తదితర విభాగాల్లో ప్రజలకు వైద్య పరీక్షలు చేశారు. అక్కడ వివిధ కౌంటర్లలో ప్రజలకు అందుతున్న సేవలపై ఎమ్మెల్యే ఆరా తీశారు. ఆరోగ్య శ్రీ ద్వారా అందే సౌలభ్యాలను ప్రజలకు ఆరోగ్య మిత్రల ద్వారా వివరించేలా చర్యలు తీసుకోవాలని డీఐఓ డాక్టర్ యుగంధర్‌ను ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, కమిషనర్ భాగ్యలక్ష్మి, అదనపు కమిషనర్ రమణారెడ్డి, ఎంహెచ్‌ఓ డాక్టర్ గంగాధర్ రెడ్డి, కార్పొరేటర్లు దుర్గాదేవి, శ్రీనివాసులు, శేఖర్‌బాబు, మునిశేఖర్, జేసీఎస్ కన్వీనర్లు ఆలమూరు శ్రీనివాస్‌రెడ్డి, చింతా సోమశేఖర్ రెడ్డి, వీరా రామకృష్ణా రెడ్డి, క్లస్టర్ అధ్యక్షులు పీవీ రమణారెడ్డి, మధుసూదన్‌గౌడ్, నాయకులు రామచంద్ర, రాధాకృష్ణ, సుహాసిని, భారతి పాల్గొన్నారు.

అనంతపురం రూరల్: ప్రజారోగ్య పరిరక్షణే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. మంగళవారం ఏ నారాయణపురం పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు నాగేంద్ర, హాజీవలి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఆలమూరు శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యనిర్వాహక సభ్యుడు మల్లెల వేణుగోపాల్, వైఎస్సార్‌సీపీ నాయకులు బి. మదన్‌మోహన్‌రెడ్డి, సత్తెన్న పాల్గొన్నారు.

మొల్లమాంబ విగ్రహం ఏర్పాటు చేయాలి

అనంతపురం కార్పొరేషన్: తొలి తెలుగు కవయిత్రి మొల్లమాంబ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కుమ్మర యువసేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవితేజ ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డిని కోరారు. మంగళవారం ఎమ్మెల్యేను ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో నాయకులు రత్నమయ్య, నాగార్జున, ఓబులేసు, వినోద్ పాల్గొన్నారు.

1,130 మెట్రిక్ టన్నుల ఎరువులు

అనంతపురం అగ్రికల్చర్: మహధాన్ అగ్రిటెక్ కంపెనీ నుంచి 1,130 మెట్రిక్ టన్నులు ఎరువులు జిల్లాకు చేరినట్లు ఏడీఏ ఎం.రవి తెలిపారు. మంగళవారం స్థానిక ప్రసన్నాయపల్లి రైల్వేస్టేషన్ రేక్‌పాయింట్‌లో వ్యాగన్ల ద్వారా వచ్చిన ఎరువులను పరిశీలించారు. ఏడీఏ మాట్లాడుతూ 20-20-0-13 రకం 503 మెట్రిక్ టన్నులు, అలాగే 24-24-0 రకం కాంప్లెక్స్ రకం 627 మెట్రిక్ టన్నులు వచ్చాయన్నారు. కలెక్టర్, జేసీ, డీఏఓ ఆదేశాల మేరకు ఇండెంట్ ప్రకారం సరఫరా చేయనున్నట్లు తెలిపారు.

హామీలు అమలు చేయాలి

అనంతపురం అర్బన్: రైతులకు ఇచ్చిన హామీలను ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేయాలని రైతు, కార్మిక సంఘాల సమన్వయ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక కృష్ణకళా మందిర్ నుంచి టవర్‌క్లాక్ వరకు కమిటీ ఆధ్వర్యంలో నాయకులు ర్యాలీ చేశారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రైతు, కార్మిక సంఘాల నాయకులు చిన్నప్పయాదవ్, ఇండ్ల ప్రభాకర్‌రెడ్డి, రాజారెడ్డి, నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర అనుచిత చర్యలను అడ్డుకోండి

అనంతపురం కల్చరల్: కేంద్ర ప్రభుత్వం మేధావులు, విద్యావంతులను ఇబ్బందులకు గురిచేస్తోందని ఏపీ ప్రభుత్వం అడ్డుకోవాలని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ కోరారు. ఈ మేరకు ఆర్ట్స్ కాలేజ్ విశ్రాంత ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, సీనియర్ లాయర్ రసూల్ అరెస్టులను ఖండిస్తూ ఓ ప్రకటన విడుదల చేశారు. బెంగళూరుకు చెందిన ఎన్‌ఐఏ పోలీసులు సాధారణ జీవితం గడుపుతున్న వారిని సంబంధం లేని కేసుల్లో ఇరికించిందని, రాజ్యాంగం ఇచ్చిన హక్కులను కాలరాసే విధానం మంచిది కాదని అన్నారు.

ఘనంగా 'పైలా' పుట్టినరోజు వేడుకలు


వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తల మధ్య కేక్ కట్ చేస్తున్న పైలా

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య పుట్టిన రోజు వేడుకలు పార్టీ కార్యాలయంలో మంగళవారం ఘనంగా జరిగాయి. పైలా కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులకు అందించారు. ఈ కార్యక్రమంలో జోనల్ ఇన్‌చార్జ్ రమేష్ గౌడ్, రాజారాం, రిలాక్స్ నాగరాజు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వీధి బాలల కోసం వేట


అనంతపురం రైల్వే స్టేషన్‌లో బాల కార్మికుల కోసం గాలిస్తున్న అధికారుల బృందం

అనంతపురం సిటీ: వీధి బాలల కోసం వేట మొదలైంది. ఐసీడీఎస్, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్, చైల్డ్ హెల్ప్‌లైన్-1098, కార్మిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో వీధి బాలలను గుర్తించేందుకు వీలుగా అనంతపురంలో మంగళవారం నుంచి స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఐసీడీఎస్ పీడీ బీఎన్ శ్రీదేవి అనుబంధ శాఖల అధికారులతో కలసి జెండా ఊపి స్పెషల్ డ్రైవ్‌ను ప్రారంభించారు. అనంతపురంలోని రైల్వే స్టేషన్, ఆర్టీసీ బస్టాండ్, ఒకటో రోడ్డు, శ్రీకంఠం సర్కిల్, శ్రీనివాస నగర్ తదితర ప్రాంతాల్లో ఆరుగురు వీధి బాలలను గుర్తించి, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ రామలక్ష్మి ఎదుట హాజరుపరిచారు. వారి సంరక్షకులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. పిల్లలను బడికి కాకుండా పనికి పంపిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పిల్లలను బడిలో చేర్పించి, వారిపై నిరంతరం నిఘా ఉంచాలని సచివాలయాల మహిళా పోలీసులను ఆదేశించారు. డీసీపీఓ సుబ్రహ్మణ్యం, సహాయ కార్మిక శాఖ అధికారిణి రమాదేవి, సీహెచ్‌ఎల్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ కృష్ణమాచారి, జీఆర్పీ ఎస్ఐ విజయకుమార్, ఆర్పీఎఫ్ ఎస్ఐ మధుకర్, మూడో పట్టణ పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ మహమ్మద్, ఐసీపీఎస్ ప్రతినిధులు చంద్రకళ, నాగలక్ష్మి, వసంత, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

అనంతపురం అర్బన్: ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ నగర కార్యదర్శి వెంకటనారాయణ, భగత్ సింగ్ ఆటో డ్రైవర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, శ్రీనివాసులు, శివప్రసాద్ అన్నారు. సోమవారం స్థానిక ఆర్ట్స్ కళాశాల సమీపంలోని ఆటో స్టాండ్ వద్ద భగత్‌సింగ్ ఆటో డ్రైవర్ల సంఘం ఆధ్వర్యంలో నాయకులు చలో విజయవాడ పోస్టర్లను విడుదల చేశారు.

● నిఘా నేత్రం.. 'విచిత్రం' అనుకోకండి!



ఏ వ్యాపారమైనా తూకం, ధర, నాణ్యతపైనే నడుస్తుంది.. వ్యాపారం చేసిన తర్వాత ఎవరైనా డబ్బు ఇవ్వకున్నా ఇచ్చామని చెప్పొచ్చు.. లేదా కొనుగోలుదారులు తూకం సరిగాలేదని అనొచ్చు.. అధిక ఆదాయం ఆశించకుండా సరసమైన ధరకు పండ్లు విక్రయిస్తూ నిక్కచ్చిగా, నిజాయితీ వ్యాపారం చేస్తే కొనుగోలుదారులు కూడా వ్యాపారిని వెతుక్కొని మరీ వస్తారని నమ్మాడు పండ్ల వ్యాపారి రమేష్. అందుకు అనుగుణంగా నగరంలోని రైల్వే స్టేషన్ ప్రాంతంలో తన వాహనానికి నిఘానేత్రం ఏర్పాటు చేసుకోవడాన్ని స్థానికులు, కొనుగోలుదారులు, పాదచారులు ఆశ్చర్యంగా చూడడం కనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:

నల్ల చట్టాలను రద్దు చేయాలి

రాప్తాడు: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు వ్యవసాయ నల్ల చట్టాలను రద్దు చేయాలని, రైతుల మోటార్లకు మీటర్లు బిగించరాదని ఏపీ రైతు సంఘం మండల కార్యదర్శి పోతులయ్య అన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం దగ్గర ఏపీ రైతు సంఘం, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం, కౌలు సంఘాల ఆధ్వర్యంలో బ్లాక్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు.